

ముగిసిన బేతల్ పూజలు

ఈ నెల 21న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. మరోవైపు సంప్రదాయ పూజలు బుధవారంతో ముగిశాయి. 8లో▸



గణతంత్ర వేడుకల్లో 'గుస్సాడీ'

ఎర్రకోట వేదికగా నిర్వహించే గణతంత్ర వేడుకల్లో 'పద్మశ్రీ' కనకరాజు బృందం గుస్సాడీ నృత్య ప్రదర్శన ఇవ్వనుంది. 11 మందిని ప్రదర్శన కోసం ఎంపిక చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. రాత్రివేళలో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించిన సరిఫికెట్ల పరిశీలన ప్రక్రియ డీఈవో కార్యాలయంలో బుధవారం రెండో రోజు కొనసాగింది. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కోసం 1:3 ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. అధికారులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయగా 700 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కాగా, జిల్లాలో 198 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 58 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానోపాధ్యాయుల పదోన్నతి కోసం మంగళవారం 156 మంది స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన జరిపిన విషయం తెలిసిందే. ప్రక్రియను డీఈవో ప్రణీత, కార్యాలయ సూపరింటెండెంట్లు పరిశీలించారు.

పాత పద్ధతిలోనే కేటగిరీలను కేటాయించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో పాఠశాలల కేటగిరీలను పాత పద్ధతిలోనే కేటాయించాలని పీఆర్టీయూ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు డీఈవో ప్రణీతకు బుధవారం వినతిపత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడారు. 2018 బదిలీల్లో పాఠశాలలను 1,2,3,4 కేటగిరీలుగా వర్గీకరించి ప్రాధాన్యత పాయింట్లు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత బదిలీల్లో పాఠశాలలకు హెచ్‌ఆర్‌ఏ ప్రకారం కేటగిరీ 1,2,3,4లుగా వర్గీకరించాలని పేర్కొన్నారు. వినతి సమర్పించిన వారిలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, నాయకులు తిరుపతి, అశోక్, రాజు, తదితరులున్నారు.

పోషకాహారం అందేలా చూడాలి



అర్లి(టి) అంగన్‌వాడీకేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ

తాంసి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందేలా చూడాలని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ అన్నారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి),గొముత్రి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. చిన్నారుల హాజరుశాతం, అందిస్తున్న భోజనం, వసతులను పరిశీలించారు. టీచర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వారికి పోషకాహారం అందేలా చూడాలన్నారు. ఆమె వెంట ఏసీడీపీవో నర్సమ్మ, సర్పంచ్‌లు రమ, వేణు, అంగన్‌వాడీ టీచర్లు నజ్మా, లత తదితరులు ఉన్నారు.

బాసరకు స్పెషల్ సర్వీస్

ఆదిలాబాద్: వసంత పంచమి పురస్కరించుకొని ఈనెల 26న బాసర అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్ నడపనున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ సర్వీస్ ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి ఉదయం 5గంటలకు బయల్దేరి బాసరకు 9 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే బాసర నుంచి 9.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.30 గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. రెండోట్రిప్ మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 6గంటలకు బాసరకు చేరుతుందని, అక్కడినుంచి సాయంత్రం 6.15 గంటలకు తిరుగు పయనమై రాత్రి 10.15 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉంటే 30 మంది ప్రయాణికులకు ఓ అదనపు బస్సు నడుపుతామని వెల్లడించారు. www. tsrtconline. in వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ సౌకర్యం సైతం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

నేరడిగొండ: విద్యార్థులు చదువులో రాణించాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని తేజాపూర్ జెడ్పీఎస్, ప్రాథమిక పాఠశాల, బొండిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా పాఠశాలల్లో మన ఊరు–మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవో భూమారెడ్డి, డీఈఈ సునీల్, సర్పంచ్ అనిత, ప్రధానోపాధ్యాయులు మహేందర్, ఉపాధ్యాయులు తదితరులు న్నారు.



జై కిసాన్

- సాగుచేసే వారిలో మనమే టాప్
- జిల్లాలో 36.2 శాతం మంది రైతులు
- రాష్ట్రంలోనే ఆదిలాబాద్‌లో అత్యధికం
- తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్‌లో వెల్లడి

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా సాగుబడిలో దూసుకుపోతోంది. జిల్లాలో అత్యధిక మంది రైతులతో రాష్ట్రంలోనే టాప్‌లో నిలిచింది. తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్)లో ఇది వెల్లడైంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే సాగు చేసే వారిలో మన జిల్లా 1,26,363 మంది రైతులతో 36.2 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. సొంత భూమి, లేనిపక్షంలో కౌలుకు తీసుకొని లేదా వ్యవసాయ పర్యవేక్షణ చేస్తున్న వారి పరంగా పలు అంశాలను లెక్కలోకి తీసుకున్నారు.

ఇతర అంశాల్లో ఇలా..

అబ్‌స్ట్రాక్ట్‌లో 20 వివిధ అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. ఆయా విభాగాల్లో జిల్లాల వారీగా ర్యాంకులను కేటాయించారు. ఇందులో జనసాంద్రత, గ్రామీణ జనాభా, అర్బన్ జనాభా, చిన్నారుల జనాభా, అక్షరాస్యత శాతం, లింగ నిష్పత్తి, ఎస్సీ, ఎస్టీ జనాభా, మెయిన్ వర్కర్స్, మార్జినల్ వర్కర్స్, రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతరత్రా అంశాలు ఉన్నాయి. జనసాంద్రతలో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. అలాగే గ్రామీణ జనాభాలో 13వ స్థానంలో, అర్బన్ జనాభా పరంగా 21వ స్థానంలో, చిన్నారుల జనసాంద్రత పరంగా 25వ స్థానంలో, అక్షరాస్యతలో 18వ స్థానంలో, లింగ నిష్పత్తిలో 12వ స్థానంలో నిలిచింది. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల పరంగా 25వ స్థానంలో, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లాలతో పోల్చితే 3వ స్థానంలో ఉంది. వ్యవసాయ కూలీలు అధికంగా ఉన్న జిల్లాల పరంగా 9వ స్థానంలో, విద్యుత్ కనెక్షన్ల సంఖ్యలో 28వ స్థానంలో నిలిచింది. ఇక రోడ్ల సాంద్రతలో 16వ స్థానంలో, మోటార్ వెహికిల్ సంఖ్యలో 27వ స్థానంలో నిలిచినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో కొన్ని ఇలా ఉన్నాయి.

జనాభా వివరాలు

జిల్లా జనాభా	7,08,972
జనసాంద్రత	179
గ్రామీణ జనాభా	76.3 శాతం
అర్బన్ జనాభా	23.7 శాతం
చిన్నారుల జనాభా	87,292
అక్షరాస్యత	63.5 శాతం
లింగ నిష్పత్తి	989 (వెయ్యి మంది పురుషులకు)

విద్యుత్ పరిస్థితి..

కనెక్షన్లలో జిల్లా స్థానం	28
గృహ కనెక్షన్లు	1,98,828
వ్యవసాయ కనెక్షన్లు	29,231
పరిశ్రమ	31,009
మొత్తం	2,59,068

వర్కర్ల పరంగా..

మొత్తం వర్కర్లు	3,49,121
మెయిన్	2,97,999 (85.4 శాతం)
మార్జినల్	51,122 (14.6 శాతం)

ఉపాధిహామీ..

మొత్తం కూలీలు	3,68,750
రాష్ట్రంలో స్థానం	14

స్వయం సహాయక సంఘాలు..

మొత్తం సంఘాలు	10,856
సభ్యులు	1,15,817

రోడ్ల పరిస్థితి..

జిల్లాల వారీగా స్థానం	16
ఎన్‌హెచ్ (కి.మీ)	117.76
పీఆర్ (కి.మీ)	2096.82
ఆర్‌అండ్‌బీ (కి.మీ)	662.77
మొత్తం	2,837.35
రోడ్ల సాంద్రత	0.71 (కి.మీ.కు చదరపు కి.మీ. వారీగా)

మోటార్ వెహికిల్స్..

మొత్తం వాహనాలు	10,107
రాష్ట్రంలో స్థానం	27
మోటార్ సైకిళ్లు	7,601
లైట్ మోటార్ వెహికిల్	988
ఎలక్ట్రానిక్ వెహికిల్స్	182

పాఠశాలల పరిస్థితి..

మొత్తం పాఠశాలలు	1439
విద్యార్థుల నమోదు సంఖ్య	1,39,078
సగటున పాఠశాలకు విద్యార్థుల సంఖ్య	97
విద్యార్థులకు ఉపాధ్యాయుల నిష్పత్తి	
1–5 వరకు 25 మంది,	
6–8 వరకు 18 మంది,	
9–10 వరకు 24 మంది,	
11–12 వరకు 67 మంది.	

రైతులు, వ్యవసాయ కూలీల శాతం..

రైతులు	1,26,363 (36.2 శాతం)
వ్యవసాయ కూలీలు	1,19,664 (34.3 శాతం)

మౌనమేల?



ఇది ఖానాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన లేఅవుట్. డీటీసీపీ నుంచి కానీ మున్సిపల్ నుంచి కానీ అనుమతులు లేవు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. అయితే సంబంధిత అధికారులు దీనిపై మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

- అక్రమమని తేల్చారు.. చర్యలు మరిచారు
- అనధికార లేఅవుట్లకు అడ్డుకట్టేది?
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

కైలాస్‌నగర్: జిల్లాలో రియల్ దందా జోరుగా సాగుతోంది. అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా పట్టించుకోని అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధులు, పలు సంఘాల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో సంబంధిత శాఖ అధికారులు ఇటీవల పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించి లెక్క సైతం తేల్చారు. అయితే చర్యలకు వెనుకంజ వేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రియల్ వ్యాపారులతో సంబంధాల కారణంగానే 'మామూలు' గా వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు లేకపోలేదు.

అనుమతి లేనట్లు తేల్చినా...

జిల్లాలో గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రం వరకు వందల సంఖ్యలో అక్రమ లే అవుట్లు ఏర్పాటవుతున్నాయి.

– ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో లేఅవుట్లు, వెంచర్లు కలిపి మొత్తం 173 ఉన్నాయి. ఇందులో 64కు డీటీసీపీ, మున్సిపల్ నుంచి అనుమతులు ఉన్నట్లుగా మున్సిపల్ అధికారులు నిర్ధారించారు. 109 లేఅవుట్లు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిబంధనలనకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని లెక్క తేల్చారు. వాటి సర్వే నంబర్లు, విస్తీర్ణం, ఏర్పాటు చేసిన వ్యాపారుల పేర్లతో సహా వివరాలు సేకరించారు. ఇక గ్రామీణ ప్రాంతాల పరిధిలో ప్రతి మండల కేంద్రంలో మూడు నుంచి నాలుగు లేఅవుట్లు ఏర్పాటయ్యాయి. ఏజెన్సీ, మైదాన ప్రాంతమనే తేడా లేకుండా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

చర్యలకు వెనుకంజ

అనధికార లేఅవుట్, వెంచర్లపై చర్యలు తీసుకునే అధికారం మున్సిపల్, డీటీసీపీ అధికారులకు ఉంటుంది. అయితే సంబంధిత శాఖలు వీటిని 'మామూలు'గా తీసుకుంటున్నాయి. ముఖ్యంగా డీటీసీపీ అధికారులు ఒక్క లే అవుట్‌ను కూడా తనిఖీ చేసిన పాపన పోలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఒక్కరే అధికారి ఉండటంతో ఆయన ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి. జిల్లాకు వచ్చినా కార్యాలయంలో రికార్డులు చూసుకుని సంతకాలు చేసి వెళ్తున్నారే తప్పా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనే దానిపై పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ అధికారి స్థానికంగా ఉండకపోవడంతో అక్కడ పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులదే హవా నడుస్తుంది. వారు 'ఎంత చెబితే అంత' అన్నట్లుగానే వ్యవహారం సాగుతోంది. డీటీసీపీ అనుమతులు లభించాలంటే అధికారి కంటే ముందు సదరు ఉద్యోగులు చెప్పే కండిషన్లకు అంగీకరించాల్సిందే. లేదంటే కార్యాలయం చుట్టూ ఎంత తిరిగినా ప్రయోజనం ఉండదు. మున్సిపల్‌లోనూ ఇదే పరిస్థితి. అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వాటిపై కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. వ్యాపారులతో సఖ్యత, రాజకీయ అండదండలే కారణంగా తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడం అనుమానాలకు బలం చేకూరుతోంది.



ఇది ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవేనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటవుతున్న లేఅవుట్. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ఎన్జీవో ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు వీటిని సందర్శించారు. అక్రమ లేఅవుట్‌గా నిర్ధారించారు కూడా. అయినా చర్యలకు వెనుకాడుతుండటం విమర్శలకు తావిస్తోంది.

అనుమతి లేకుంటే చర్యలు

లేఅవుట్, వెంచర్లు ఏర్పాటు చేసే వారు టీఎస్ బీపాస్ ద్వారా తప్పనిసరిగా అనుమతులు పొంది ఉండాలి. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసినట్లు తేలితే వాటిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. అక్రమ లేఅవుట్లను తొలగించడంతో పాటు బాధ్యులపై కూడా చర్యలకు వెనుకాడం.

– రిజ్వాన్ బాషా షేక్, అడిషనల్ కలెక్టర్

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం

- అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



సీనియర్ ఓటరును సన్మానిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవంను కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈపీ రేషియో పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఓటరు జాబితా సిద్ధం చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవడం మన కర్తవ్యమన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన పాట, చీఫ్ ఎన్నికల కమిషనర్ సందేశాలను ప్రదర్శించారు. ఉద్యోగులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. పలువురు సీనియర్ ఓటర్లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్‌రాజు,డీఎస్ఓ కిరణ్ కుమార్, స్వీప్‌నోడల్‌అధికారి లక్ష్మణ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా పాల్గొన్నారు.

కంటి వెలుగుపై విస్తృత ప్రచారం

జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రత్యేక కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. ఆవరణలోని పలుశాఖల ఉద్యోగులు, సిబ్బందికి కంటి పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 33 శిబిరాల ద్వారా రోజుకు 5700 మందికి స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామన్నారు. 16నుంచి 17శాతం మందికి రీడింగ్ గ్లాసులు తక్షణమే అందిస్తున్నామని, పది శాతం మందికి ప్రిస్క్రిప్షన్ కలిగిన అద్దాలకు ఆన్‌లైన్ ద్వారా ఇండెంట్ పంపిస్తున్నామన్నారు. జిల్లాలోని వయోజనులందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలి పారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, కోర్టు కాంప్లెక్స్, మీడియా వారికి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్ తదితరులు పాలొన్నారు.

లింగ వివక్షతకు తావివ్వొద్దు

- బాలికలను ప్రోత్సహించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్



విద్యార్థికి మెమొంటో అందజేస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: సమాజంలో లింగ వివక్షతకు తావివ్వకుండా బాలికలను బాలురతో సమానంగా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. బాలికల ఆత్మరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిక్షణను ప్రారంభించినట్లుగా వెల్లడించారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ లింగ వివక్షత రూపు మాపేందుకు తమ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ బాలికలు ప్రణాళికలతో కూడిన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేదిశగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వాలు బాలికల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక, సాంస్కృతిక నృత్యాలు, ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా మెమొంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి మిల్కా, సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

కైలాస్‌నగర్: 74వ భారత గణతంత్ర వేడుకలను కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా వేడుకలు పట్టణంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తుండగా ఈ సారి కలెక్టరేట్‌లో నిర్వహించాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు అధికారులు జెండా ఎగురవేసే వేదికను ముస్తాబు చేశారు. ఉదయం 10గంటలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారని అధికారవర్గాలు తెలిపాయి.



గణతంత్ర వేడుకలకు సిద్ధమైన వేదిక

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



రిమ్స్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న స్టాఫ్ నర్సులు

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. రిమ్స్ ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ, స్టాఫ్ నర్సులకు ప్రతినెలా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతీ నెల 5వ తేదీలోగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని, లేకుంటే డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశన్న, నవీన్‌కుమార్, దేవిదాస్, సురేందర్, పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాత పరీక్ష మెరిట్ లిస్టు విడుదల

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 27 రేషన్‌షాపు డీలర్ల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను అధికారులు బుధవారం ప్రకటించారు. వివరాలను ఆర్డీవో కార్యాలయ నోటీస్‌బోర్డుపై అందుబాటులో ఉంచారు. మెరిట్ ఆధారంగా 1:5 ప్రకారం అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేసినట్లు ఆర్డీవో రమేశ్‌రాథోడ్ తెలిపారు. వీరికి ఈ నెల 27న ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

గుప్తనిధుల కోసం తవ్వకాలు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జైనథ్: మండలంలోని హత్తిఘాట్ గ్రామంలో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపుతున్నాయి. హత్తిఘాట్ పంప్ హౌజ్ పక్కన చింత చెట్టు కింద విఠలేశ్వర స్వామి జెండా గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి తవ్వకాలు చేపట్టడంతో గ్రామంలోని గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ పూర్వీకుల పురాతన కట్టడాలు, పురాతన ఇండ్ల గోడలు, చుట్టుపక్కల దేవతల విగ్రహాలు ఉండేవని చెబుతున్నారు. కొన్నిరోజులుగా ఇక్కడ గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అడవి జంతువులతో పాటు దొంగల నుంచి తమకు రక్షణ కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇచ్చోడలో ఐదుగురు విద్యార్థులు డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో డిబార్ల పర్వం ఆగడం లేదు. ప్రతి పరీక్షలో పదుల సంఖ్యలో విద్యార్థులు డిబార్ అవుతూనే ఉన్నారు. తాజాగా బుధవారం జరిగిన పరీక్షలో ఇచ్చోడలో ఐదుగురు విద్యార్థులు కాపీ కొడుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ ఎర్రోల్ల నరేందర్ తెలిపారు. ఇచ్చోడలోని సాయి సమత్‌లో ముగ్గురు, కాకతీయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డిబార్ అయినట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మివాడలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గుమ్మిడేల రోషన్ పట్టణంలోని మారుతి షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి మూడు నెలల కిందట వివాహమైంది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నీటితో మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి ఖాళీ బూడిదైంది. సుమారు మూడు లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



కాలిపోయిన ఇంటి సామగ్రి

ముగిసిన బేతల్ పూజలు

- మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు
- కొనసాగుతున్న నాగోబా జాతర
- తరలివస్తున్న భక్తజనం
- దర్శనానికి గంటల తరబడి క్యూలో..
- జనసంద్రంగా నాగోబా ఆలయం



నాగోబా ఆలయానికి మొక్కి బేతల్ పూజలు ముగిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర బుధవారం బేతల్ పూజతో సంప్రదాయ పూజలను ముగించారు. ముందుగా సంప్రదాయ వాయిద్యాలతో గోవడ్ ముఖద్వారం వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులకు ఆ వంశం మహిళలు కాళ్లు కడిగి బేతల్ పూజకు ఆహ్వానించారు. మెస్రం వంశం మహిళలు, కొత్తకోడళ్ల బేటింగ్ అయ్యారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులకు కానుకలు అందించారు. మెస్రం వంశం పెద్దలు వెదురుకర్ర పట్టుకుని బేతల్ నృత్యాలు చేశారు. బేతల్ పూజలు ముగిసిన అనంతరం నాగోబాకు మొక్కి సంప్రదాయ పూజలు ముగించారు. అనంతరం గోవడ్ సమీపంలో సతిదేవత ఆలయంలో వచ్చిన కానుకాలను, ప్యాలాలను 22కితల వారీగా పంపిణీ చేశారు. రూ.లక్షా 29వేలు కానుకలు వచ్చినట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా మహా పూజలకు తీసుకొచ్చిన కొత్త కుండలను కితల వారీగా మెస్రం వంశీయులకు పంపిణీ చేశారు. వాటికి ఏడాది పాటు పూజలు చేయాలని సూచించారు. సాయంత్రం ఉట్నూర్ మండలం లోని శ్యాంపూర్ బుడుందేవ్ ఆలయానికి బయలుదేరారు. ఈ నెల 27న తెల్లవారుజామున బుడుందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించనున్నట్లు మెస్రం వంశం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశం పెద్దలు మెస్రం బాదిరావ్ పటేల్, మెస్రం కోసు కటోడ, మెస్రం దేవ్‌రావ్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం సోనేరావ్, మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి ఉన్నారు.

కొనసాగుతున్న నాగోబా జాతర

నాగోబా జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంటల తరబడి క్యూలో ఉండి దర్శనం చేసుకుంటున్నారు. బుధవారం సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో నాగోబా ఆలయం జనసంద్రమైంది. ఈ నెల 28 వరకు జాతర అధికారికంగా కొనసాగుతుండగా అనాధికారికంగా 31 వరకు కొనసాగనుందని దేవదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు.



వెదురుకర్రను శుద్ధిచేస్తున్న మెస్రం మహిళ



నాగోబా ఆలయంలో పూజలకు క్యూలో భక్తులు



కానుకలు వేస్తున్న మెస్రం వంశం మహిళలు, కొత్త కోడళ్లు



కాగడాలు వెలిగించి బేతల్‌పూజ ప్రారంభిస్తున్న మెస్రం వెంకట్‌రావ్

నాగోబాను దర్శించుకున్న ఏఆర్సీవో



పూజలు చేస్తున్న ఏఆర్సీవో, అధికారులు

ఇంద్రవెల్లి: నాగోబాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల ఏఆర్సీవో మహేశ్వర్‌రావు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. నాగోబా ఆలయ, జాతర చరిత్రను మెస్రం వంశీయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట లక్సెట్టిపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలితాకుమారి, ఉపాధ్యాయులు సురేష్, స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపరాపు సత్యరాజ్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు సీఐలు బదిలీ

మంచిర్యాలక్రైం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్లో పని చేస్తున్న సీఐ బీ.శ్రీనివాస్‌ను నిర్మల్ రూరల్ సీఐగా, ఆదిలాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కొంక మల్లేశ్‌ను నిర్మల్ టౌన్‌కు, రామగుండం సీఆర్‌బిలో పనిచేస్తున్న రాజ్‌కుమార్‌గౌడ్‌ను బెల్లంపల్లిరూరల్‌కు, నిర్మల్ రూరల్ సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, నిర్మల్‌టౌన్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎన్‌శ్రీనివాస్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, బెల్లంపల్లి రూరల్‌లో పనిచేస్తున్న బాబురావ్‌ను రామగుండం సీసీఆర్బీకి బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'గిరి' విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న పీవో వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: గిరిజన విద్యార్థులు రాష్ట, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ హాకీ క్రీడల్లో ద్వితీయ స్థానం సాధించిన గిరిజన క్రీడా పాఠశాల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను డీడీ దిలీప్‌కుమార్‌తో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి హాకీలో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. జట్టులో 14 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఉండడం, ఆ జట్టు రాష్ట స్థాయిలో గెలుపొందడం అభినందనీయమన్నారు. ఉట్నూర్‌లో ప్రత్యేక హాకీ క్రీడా మైదానాన్ని రెండు నెలల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రీడాకారులకు ఐటీడీఏ ద్వారా పూర్తి స్థాయి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు ప్రత్యేక డైట్‌తో పాటు హాకీ స్టిక్స్, క్రీడా దుస్తులు అందిస్తామని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను భువనేశ్వర్‌లో జరుగుతున్న ప్రపంచ హాకీ క్రీడా పోటీలను తిలకించేందుకు పంపించాలని డీడీని ఆదేశించారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన క్రీడల అధికారి పార్థసారధి, ఏటీడీవోలు క్రాంతి, నిహారిక ప్రధానోపాధ్యాయులు ఉత్తమ్, శ్రీనివాస్, మధుసూదన్, హేమంత గోవింద్, కోచ్‌లు శేఖర్, సునంద్, శివ పాల్గొన్నారు.

అటవీశాఖ సిబ్బంది దాడి !



ఎఫ్‌బీవోను నిర్బంధించిన గ్రామస్తులు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండం గొండుగూడ గ్రామానికి చెందిన కొవలింబారావు అనే వ్యక్తిపై బుధవారం అటవీశాఖ సిబ్బంది దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. లింబారావు కట్టెల కోసం అడవికి వెళ్లినట్లు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది నాగల్‌కొండ అటవీ ప్రాంతానికి వెళ్లి అతడిపై దాడి చేశారు. దీంతో బాధితుడు గ్రామానికి తిరిగి వచ్చి జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో గ్రామస్తులు నిరసనకు దిగారు. అధికారుల దాడి విషయాన్ని తెలుసుకున్న బీట్ అధికారిణి కళ్యాణి బాధితుడిని పరామర్శించేందుకు గ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామస్తులు ఘెరావ్ ఆమెను చేశారు. దాదాపు 3గంటల పాటు నిర్బంధించడంతో కల్యాణి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పారు. అప్పటికే నిరసించిన బీట్ అధికారిణి కళ్లు తిరిగి పడిపోవడంతో ఆమెకు ప్రథమ చికిత్స అందించి ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. అలాగే బాధితుడు లింబారావుకు రక్తపోటు అధికం కావడంతో ఉట్నూర్ తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. బాధితుడి భార్య కోవ రాధాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను కడతేర్చిన భర్త అరెస్టు

- తాగినమైకంలో ఘాతుకం..
- డబ్బులు ఇవ్వలేదని కోపంతోనే..
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ కిరణ్‌ఖారే



వివరాలు వెల్లడిస్తున్న భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారే

భైంసారూరల్: మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతోనే ఈ నెల 19న భార్యను హత్యచేసిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు ఏఎస్పీ కిరణ్‌ఖారే తెలిపారు. భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. మండలంలోని దేగాం గ్రామానికి చెందిన సట్ల రమేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఏ పనిచేయకుండా భార్య సురేఖను వేధిస్తూ డబ్బులు ఇవ్వకపోయేసరికి కోపం పెంచుకున్నాడు. సురేఖ బీడీ కంపెనీలో పనిచేస్తు ఇద్దరు పిల్లలను పోషిస్తుంది. రోజు మద్యం కోసం రమేశ్ వేధించేవాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో సురేఖపై కోపం పెంచుకున్నాడు. ఈ నెల 19 ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్య సురేఖపై దాడికిదిగాడు. రోప్(దారం)తో గొంతు నులిమి కడతేర్చాడు. ఎవరికి అనుమానం రాకుండా ఇంట్లోనే మృతదేహం వదిలి బయటకు వచ్చి ఇంటి తలుపులు బిగించి తాళం వేయబోయడు. గమనించిన చుట్టు పక్కల వారు అలా ఎందుకుచేస్తున్నావని ప్రశ్నించడంతోనే రమేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. సురేఖ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన పోలీసులు రమేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. హత్యచేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

పత్తి రైతులు, కూలీల జీవితాల మెరుగుకు ఐఎల్‌వో కృషి



మాట్లాడుతున్న అసోసియేట్ అపూర్వ

ఎదులాపురం: పత్తి రైతులు, దాని అనుబంధంగా పనిచేస్తున్న కూలీల జీవితాలు మరింతగా మెరుగు పర్చడమే లక్ష్యంగా ఐఎల్‌వో కృషి చేస్తున్నట్లు ఇంటర్‌నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో) సీనియర్ రీసెర్చ్ అసోసియేట్ (ఢిల్లీ) అపూర్వ అన్నారు. జిల్లాలో ఐఎల్‌వో ఆధ్వర్యంలో చేపట్టిన ఫండమెంటల్ ప్రిన్సిపల్ అండ్ రైట్స్ ఎట్ వర్క్ (ఎఫ్‌పీఆర్‌డబ్ల్యూ) ప్రాజెక్టు సాధించిన పురోగతిని తెలుసుకునేందుకు తాను పరిశీలనకు వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో దాదాపు 100కు పై గ్రామాల్లో ఐఎల్‌వో ప్రాజెక్టు చేపట్టిందన్నారు. పత్తి రైతులు, దాని అనుబంధంగా పనిచేస్తున్న కూలీలకు వారి హక్కులు, వారికి దక్కాల్సిన సంక్షేమాభివృద్ధి ఫలాలను వివరించడం జరిగిందన్నారు. వారి జీవితాలను మెరుగు పర్చడమే తమ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఇటీవలే ఎఫ్‌పీఆర్ డబ్ల్యూ ప్రాజెక్టు ఆదిలాబాద్‌లో ముగిసిందన్నారు. అనంతరం మండల కోఆర్డినేటర్లతో పలు అంశాలపై చర్చించారు. ఐఎల్‌వో ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఇందులో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఐఎల్‌వో జిల్లా కోఆర్డినేటర్ ఎస్.విలాస్, ఏఐటీయూసీ నాయకులు కుంటాల రాములు, సిర్ర దేవేందర్, గాజంగుల రాజు, ఐఎల్‌వో మండల కోఆర్డినేటర్లు ఆశన్న ఉన్నారు.

నూతన నియామకం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆస్పత్రిలో ఫార్మాసిస్ట్ గ్రేడ్–1గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసచారి రెండోసారి తెలంగాణ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన నాల్గోవ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సత్యనారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య

తానూరు: ఉరేసుకుని బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై బాను వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దాకాజీ అనిల్ (16) గొర్రెలు కాసేందుకు తానూరులో పాలేరుగా పనిచేస్తున్నాడు. ఎల్వి గ్రామానికి చెందిన ఎగ్గాం రాజు శివారులో పంట చేనులో రెండు రోజుల క్రితం గొర్రెల మందను పెట్టారు. ఈ నెల 24వ తేదీన వ్యవసాయ పొలంలో రాజు ఫోన్ అనిల్‌కు దొరికింది. దీంతో ఆ ఫోన్‌ను తిరిగి రాజ్‌కు ఇచ్చాడు. అయితే బుధవారం మధ్యాహ్నం అనిల్ ఎల్వి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దీపాయిగూడలో దొంగల బీభత్సం



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

జైనథ్: మండలంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి, లింగన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నలుగురు వ్యక్తులు గ్రామంలోకి చొరబడ్డారు. సురేష్ రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి, బీరువాలోని 12తులాల బంగారం, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు వేరే గదిలో పడుకొని ఉండడంతో దొంగలు చప్పుడు చేయకుండా దొంగతనం చేసి వెళ్లిపోయారు. అనంతరం లింగన్న ఇంటి ఆవరణలో ఉన్న బైకును దొంగలించారు. ఉదయం లేచి చూడడంతో సురేష్ రెడ్డి ఇంట్లో బట్టలు చిందరవందరగా కనిపించడం, బీరువాలోని డబ్బులు, బంగారం లేకపోవడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లింగన్న ఇంటి ఆవరణలోని బైక్ సైతం కనిపించకపోవడంతో ఎవరో దొంగలు పడ్డారని అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో క్లూస్ టీంతో కలిసి రంగంలోకి దిగిన పోలీసులు గ్రామంలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సంఘటన స్థలంలో లభ్యమైన అన్ని ఆధారాలు సేకరించామని, దర్యాప్తు కొనసాగుతుందని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు.